క్లుప్తంగా

కులవివక్షను నిర్మూలించాలి



మాట్లాడుతున్న రావత్

కర్నూలు(సెంట్రల్): సమాజానికి కులవివక్ష మంచిది కాదని కేంద్రీయ సామాజిక సమర సత్ ప్రముఖ్ శ్రీదేస్‌జీబాయ్ రావత్ అన్నారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యాలయంలో దక్షిణాంధ్ర సామాజిక సమరసత ప్రాంత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మంలో కుల వివక్ష ఉండేది కాదన్నారు. విధర్మీయుల పాలన ప్రారంభమైన సమయంలో వివక్ష ప్రారంభమైనట్లు చెప్పారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు మాలిగి వ్యాసరాజు, సమరసత ప్రముఖ్ వేదిక మహేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుత సీజన్‌లో ప్రతిఒక్కరూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. ఆయన ఆదివారం కర్నూలు రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని వారికి దోమతెరలు, పాదరక్షలు అందిస్తానని చెప్పారు. అలాగే పౌష్టికాహారం తక్కువ ధరలో అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పోచమ్మ

కర్నూలు(సెంట్రల్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో సమ్మెకు వెళ్లిన సమయంలో ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని అభ్యర్థించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శివలక్ష్మీ, ఈశ్వరిబాయ్ ఎంపికయ్యారు. ఇక జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ నుంచి ఒకరినీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. అలాగే ఆఫీసు బేరర్లుగా రమీజాబీ, సుబేదా, అలివేలమ్మ, జ్యోతి, శారద, వెంకటమ్మ, అనిత, త్రివేణి, మాధవి, దస్తగిరమ్మ, కాంతమ్మ, మహేశ్వరిలను ఎన్నుకున్నారు.

ఆదమరిస్తే అంతే !



గాంధీనగర్‌లో మూత లేని మ్యాన్‌హోల్

కర్నూలు (టౌన్): తెరచుకున్న మ్యాన్ హోల్‌లో ఎవరైనా పడి గాయాలపాలైతే గానీ మన మున్సిపల్ అధికారులు స్పందించేటట్లు కనిపించడం లేదు. స్థానిక గాంధీ నగర్ మెయిన్ రోడ్డులో చాలా రోజులుగా మ్యాన్ హోల్ మూత లేకుండా తెరచుకొని ఉంది. ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్ వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి సమస్యను పరిష్కరించడంలోనూ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనడానికి ఇదే నిదర్శనం. చీకటి పడితే ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే అదిగో..ఇదిగో అంటూ దాటవేస్తున్నారే తప్ప పరిష్కరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. పెద్దగా ఖర్చయ్యే పని కాదు.. కనీసం ఇలాంటి సమస్యలను కూడా పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

నాటి స్ఫూర్తి నేడు ఏదీ?

- వీనస్ కాలనీలో 168 అడుగుల స్థూపంపై రెపరెపలాడిన అతిపెద్ద జాతీయ జెండా మాయం
- అధ్వానంగా మారిన మున్సిపల్ పార్కు
- నయా పైసా విదల్చని నగర పాలక యంత్రాంగం
- గత ప్రభుత్వంలో రూ.50 కోట్లతో నగర పార్కుల ముస్తాబు



వీనస్ కాలనీ పార్కులో అతి పెద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నాటి ప్రజాప్రతినిధులు (ఫైల్)

కర్నూలు (టౌన్): ఈ ఫోటో చూడండి. 'సరిగ్గా 2021 డిసెంబర్ 3వ తేదీన 44వ వార్డు పరిధిలో వీనస్ కాలనీ పార్కు–1 ను గత ప్రభుత్వ పాలకులు ప్రారంభించారు. అప్పట్లో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, నగర పాలక కమిషనర్ డి.కె.బాలాజీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 168 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహా నగరాలకే పరిమితమైన అనేక సౌకర్యాలు సదుపాయాలు కల్పించారు. నడక మార్గం ఏర్పాటు చేశారు. గ్రీనరీ ఏర్పాటు చేశారు. అద్భుతంగా తీర్చిదిద్దారు.

ఇప్పుడు.. ప్రభుత్వం మారింది. ఇప్పుడున్న నగరపాలక అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవ లేక పోవడంతో ఆనాడు కాలనీ వాసులకు ఆహ్లాదంగా ఉన్న పార్కు నేడు అధ్వానంగా మారింది. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. ఎన్నో ప్రత్యేకతలతో కూడిన పార్కు కనీసం నడిచేందుకు కూడా అనువుగా లేదు. కర్నూలు నగరానికే తలమానికంగా 168 అడుగుల ఎత్తు గల స్థూపంపై ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మాయం చేశారు. ఎవరూ చేశారు? చేయాల్సిన అవసరం ఏముంది?. ప్రభుత్వం మారితే ఇలా చేస్తారా? అని స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పార్కు నిర్వహణ కమిటీని నిర్వీర్యం చేసి కొంతమంది పార్కును అధ్వానంగా చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు రాజేశ్వర రెడ్డి, విక్రమ సింహారెడ్డి మూడేళ్ల పాటు పార్కును చక్కగా నిర్వహణ చేశారు. కమిటీని నియమించి వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసి సొంత ఖర్చులు వెచ్చించి పర్యవేక్షించడంతో నిర్వహణ చక్కగా ఉండేది. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. గత ప్రభుత్వానికి పేరు వస్తుందన్న అక్కసుతో పార్కును ప్రస్తుత పాలకులు పట్టించుకోకపోవడం, అధ్వానంగా మార్చడం చేశారు.దీంతో ఒకప్పుడు పచ్చగా ఉన్న ఈ పార్కు ఇప్పుడు అడ్డదిడ్డంగా గడ్డి మొలచి ఇబ్బందికరంగా మారింది.

గతంలో నిధులు వెచ్చించి నిర్వహణ

తెలుగుదేశం పార్టీ నగర పాలకవర్గానికి పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా స్పెషల్ అధికారుల పాలనలో నెట్టేసింది. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, 2021లో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించడం, ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం జరిగింది. దీంతో పాలక వర్గం ఏర్పడటంతో నగర అభివృద్ధికి పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించారు. గ్రీనరీ సిటీ, స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దారు. పారిశుద్ధ్యంలో అనేక మార్పులు తీసుకొచ్చారు. రూ.50 కోట్లు వెచ్చించి నగరవాసుల కోసం అందమైన పార్కులు ఏర్పాటు చేశారు. అందులో అమ్మ హాస్పిటల్ వద్ద రూ.1.87 కోట్లతో సైన్సు థీమ్ పార్కు, డాక్టర్స్ కాలనీలో రూ.1.89 కోట్లతో కల్చరల్ థీమ్ పార్కు, అశోక్ నగర్‌లో రూ.10 లక్షలతో ఫ్రూట్ థీమ్ పార్కు, ఎస్‌బీఐ కాలనీలో రూ.1.79 కోట్లతో మ్యూజిక్ థీమ్ పార్కు, చాణిక్యపురి కాలనీలో రూ.1.62 కోట్లతో కార్టూన్ థీమ్ పార్కు, చిల్డ్రన్స్ పార్కులో రూ.1.92 కోట్లతో గ్లోగార్డెన్ పార్కు ఇలా ఎన్నో పార్కులు నగరంలో అందంగా తీర్చిదిద్దారు.



జెండా మాయమై ఒట్టిగా మిగిలిన 168 అడుగుల స్థూపం



పార్కు ప్రాంగణంలో అపరిశుభ్రత

నయాపైసా విదల్చని ప్రస్తుత పాలకులు

అధికార మార్పిడి జరిగింది. 5 నెలలు కావొస్తోంది. నగర అభివృద్ధికి సంబంధించి నయాపైసా విదల్చలేదు. గతంలో నగర వాసుల కోసం ఏర్పాటుచేసిన పార్కుల నిర్వహణను గాలికి వదిలేసింది. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఎన్నో ఉన్నా పట్టించుకోకపోవడంపై ఇప్పటికే ప్రజల్లో అసహనం పెరిగింది. కర్నూలు నగరానికి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకప్పటి రాజధాని కర్నూలును అందంగా తీర్చిదిద్దాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

నేడు నగరపాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సకాలంలో పన్ను చెల్లించాలి

కర్నూలు (టౌన్): ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి పాటు పడాలని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు సూచించారు. సెలవు రోజు ఆదివారం నిర్వహించిన పన్ను వసూలు కేంద్రాలను రెవెన్యూ ఆఫీసర్ జునీద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద తైక్వాండో సాధన చేస్తున్న క్రీడాకారులకు కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారెడ్డి ఆదివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. క్రమం తప్పకుండా సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు ఇలా..?



బిర్లాగడ్డ - కృష్ణానగర్ మార్గంలో అండర్ బ్రిడ్జి వద్ద మురుగునీటిలోనే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

కర్నూలు (టౌన్): నగరంలోని బిర్లాగడ్డ నుంచి కృష్ణానగర్ వైపు వెళ్లే రహదారిలో అండర్ బ్రిడ్జి ఉంది. ఇక్కడ నిరంతరం మురుగు సమస్యతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలంగా ఈ సమస్య ఉంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సైతం మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో బిర్లాగడ్డ అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇటీవల మరోసారి ఇదే సమస్యను మున్సిపల్ అధికారులకు గుర్తు చేశారు. పరిష్కరిస్తామని చెప్పారు. అంతే.. ఒక్క అడుగు ముందుకు పడలేదు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజీ నీరు, వర్షపు నీరు మురుగు కుంటలా తయారవుతుంది. అదే దారిలోనే ఎక్కువగా వాహన రాకపోకలు చేస్తుంటారు. బిర్లా గేటు, కృష్ణానగర్, న్యూకృష్ణా నగర్, ఆదిత్య నగర్, కాలనీలకు వెళ్లే వారంతా ఇదే దారిలోనే వెళుతుంటారు. అలాగే బిర్లా గడ్డ నుంచి సి.క్యాంపు రైతుబజార్‌కు ఎక్కువగా మహిళలు సైతం వెళుతుంటారు. వీరందరికీ తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఇక ఆ ప్రాంతం అంతా కంపు, దుర్వాసన, ఎక్కడి నుంచో చెత్త తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదే దారిలోనే స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. చిమ్మ చీకటితో ఉంటుంది. సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరానికి చెందిన సి.మధు అనే భవన నిర్మాణ కార్మికుడు పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై చనిపోవడం బాధాకరమని సీపీఎం నాయకుడు ఎస్‌డీ ఖాజాపాషా, కె.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుంగిన రోడ్డు



హొళగుంద: మండలంలోని అగ్రహార ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు కుంగిపోయింది. కురుస్తున్న వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారైంది. మోకాలోతు గుంతలు పడి కంప చెట్లు రోడ్డుకు అడ్డంగా పెరగడంతో అటు వైపు తిరిగే భక్తులు, రైతులు, ముద్దటమాగి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే గుంతలను తప్పించేందుకు ప్రయాణం సర్కస్‌ను తలపిస్తూ నరకాన్ని చూపుతోందని వాపోతున్నారు. అధికారులు కనీసం గ్రావెల్ వేసి గుంతలు కూడా పూడ్చకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లెల్సీ నుంచి ఆలయం వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

సీఎం గారూ.. ఉచిత బస్సు హామీ అమలు ఎప్పుడు?

కర్నూలు సిటీ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ఏమైందని, తక్షణమే హామీని అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సిటీ విభాగం ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో కలిసి నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పరిగెల మురళీ కృష్ణ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పింస్తోందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు దాటినా హామీని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు జిలానీ బాషా, షేక్ ఖాజా హుసేన్, ఎస్.ప్రమీల, వెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, ఆర్‌యూ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నత విద్య కుంటుపడిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విద్యను అభివృద్ధి చేసి జిల్లా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్శిటీ, ఉర్దూ యూనివర్శిటీలకు నిధులు కేటాయించాలని, ఆయా వర్సిటీ పరిధిలోని కాలేజీల్లో కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రవేశ పెట్టి, అభివృద్ధికి రూ.600 కోట్లు కేటాయించాలన్నారు. ఆ సంఘం నాయకులు అమర్, రాజు, మౌలాలి, భరత్‌జోష్, శివాజీ, శీను, భాస్కర్ పాల్గొన్నారు.

మూడేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి

- గుండెపోటుతో ఇద్దరూ మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు



తల్లి మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

పత్తికొండ(తుగ్గలి) : మూడేళ్ల క్రితం తండ్రి గుండెపోటుతో మృతి చెందగా..ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలయ్యారు. పత్తికొండ మండలంలోని చందోలి గ్రామానికి చెందిన తుప్పటి లక్ష్మి (34)కి 15ఏళ్ల క్రితం తుగ్గలి మండలం మారెళ్లకు చెందిన అంజినయ్యతో వివాహం జరిగింది. వీరికి జయశ్రీ (13), అంకిత (10), ఉష్శ్రీ (5) కూతుళ్లు ఉన్నారు. కూలీ నాలీ చేసుకొని జీవనం సాఫీగా సాగుతున్న సమయంలో మూడేళ్ల క్రితం అంజినయ్య గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో లక్ష్మి పుట్టినిల్లు చందోలికి వచ్చింది. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో సమీప బంధువు దగ్గర ఉంటూ కూలీ పనులకు వెళ్తూ పిల్లలను పోషిస్తోంది. ఆదివారం పొలం పనులకు వెళ్లిన లక్ష్మి.. ఇంటికి వచ్చిన కాసేపటికే గుండె పోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. లక్ష్మి మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. ఈ ఘటనతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

యోగా పోటీల్లో సత్తా చాటాలి



జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉన్నాలో నిర్వహించనున్న 49వ జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల యోగా పోటీల్లో జిల్లా జట్టు సత్తా చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా యోగా సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటివరకు జాతీయ పోటీల్లో జిల్లా నుంచి 110 మంది యోగా క్రీడాకారులు పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులకు నజరానా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పతకాలతో తిరిగి రండి

కర్నూలు (టౌన్): హిందూపూర్ పట్టణంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న 68వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్లను వారు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. బాలుర జట్టులో దస్తగిరి, జశ్వంత్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, సాధిక్, ప్రణయ్‌కుమార్, ఆసిఫ్, రంగడు, ప్రేమ్‌కుమార్, హర్షిత్, భరణి, అల్లూరయ్య బాలికల జట్టులో భూమిక, లక్ష్మీప్రసన్న, శ్రీవాణీ, పూజిత, అక్షరశ్రీ గౌరి, ఐశ్వర్య, నందిని, సురేఖ, పరిమళ, త్రివేణి, ఉషాశ్రీ ఉన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



కళాకారులతో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తదితరులు

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, రంగస్థల నటి మంగాదేవి తెలిపారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో సత్యహరిచంద్ర నాటకంలోని హరిచంద్ర పాత్రను ఆమె పోషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో కర్నూలు కళాకారుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేస్తామన్నారు. ఒంగోలులో తమ ప్రదర్శన ద్వారా వచ్చిన రూ.2 లక్షల నగదును వరద సహాయ నిధికి అందజేశామన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడారు. కళాకారులు మంగాదేవితో పాటు వనజ కుమారి, ఆంజనేయులు, రాజారత్నం, సంగాంజనేయులను సత్కరించారు. క్షేత్రం కార్యదర్శి మియా, కన్వీనర్ జీవీ శ్రీనివాస్‌రెడ్డి, యాగంటి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహరిరెడ్డి, చిత్రంలో డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ఆర్థరైటిస్ (కీళ్లవాతం)పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, రుమటాలజిస్టు డాక్టర్ శ్రీహరిరెడ్డి చెప్పారు. వరల్డ్ ఆర్థరైటిస్ డే పురస్కరించుకుని ఆదివారం ఉదయం కర్నూలు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టరేట్ వద్ద డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, శ్రీహరిరెడ్డి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి ప్రారంభమై రాజవిహార్ వరకు కొనసాగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆర్థరైటిస్‌తో బాధపడే వారి సంఖ్య పెరిగిందన్నారు. జీవనశైలిలో మార్పులతో పాటు ఆహారపు అలవాట్లు, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల ఆర్థరైటిస్ వస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే రోగులు వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలన్నారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే నయం చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. లేకపోతే దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి వస్తుందని చెప్పారు. నర్సింగ్ విద్యార్థులు, మెడికల్ రెప్స్, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం









కర్నూలు నుంచి జొహరాపురం, ఇందిరమ్మ గృహాల కాలనీ మీదుగా వెంకాయపల్లెకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా గుంతలమయం, కొన్నిచోట్ల పూర్తిగా రోడ్డే లేకుండా తారు లేచిపోవడంతో ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా అధికారులకు, ప్రభుత్వానికి కనిపించదా? అని ఆ కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే రహదారిని బాగు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బీసీ భవన్ నిర్మాణానికి నిధుల మంజూరు

కర్నూలు(అర్బన్): నగరంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న బీసీ భవన్ నిర్మాణానికి కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు రూ.2.50 కోట్లను మంజూరు చేయించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం న్యాయవాది చీమల చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీ నాగరాజును కలిసి శాలువా కప్పి సన్మానించామన్నారు. త్వరలోనే నిధులు విడుదల అవుతాయని చెప్పారు.

ఎంపీటీసీ సభ్యుడు మృతి

కర్నూలు రూరల్: మండల పరిధిలోని పసుపుల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మురళీకృష్ణ (52) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన కొన్నిరోజులుగా మూత్రపిండాల సమస్యతో కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం సర్పంచ్ బొగ్గుల శీలమ్మ, కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్, డీఈ కర్రెన్న, ఏఈ ముక్తార్ బాషా, పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి తదితరులు మురళీకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.